సాక్షి చిత్తూరు

శనివారం ; 29 ; ఏప్రిల్ ; 2023



ఆకాశ పందిళ్లు..భూలోక సందళ్లు

తిరుమల: పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్స వాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది.

-9లో



పేదల అభ్యున్నతికే 'నవరత్నాలు'

గంగాధరనెల్లూరు : పేదల అభ్యున్నతికి నవరత్నాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం తెలిపారు.

-IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	25
తిరుపతి	37	26
తిరుమల	32	21
గూడూరు	38	27
నగరి	37	26

న్యూస్‌రీల్

ఐదుగురు టీచర్లకు ఉద్యోగోన్నతి

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి జిల్లాలోని ఐదుగురు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు (స్పెషల్ ఎడ్యుకేషన్)గా ఉద్యోగోన్నతి కల్పించినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు శుక్రవారం డీఈవో విజయేంద్రరావు విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర్వులు స్వీకరించిన టీచర్లు వెంటనే కొత్త స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించామని వెల్లడించారు.

వరసిద్ధుని హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ 15 రోజులకు గాను కానుక రూపేణా మొత్తం రూ.91లక్షలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

అత్యవసర చికిత్సలకు ప్రాధాన్యం



రికార్డులు పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ నాయక్

చిత్తూరు రూరల్ : అత్యవసర చికిత్సలకు ప్రాధాన్యమివ్వాలని, ఆయా కేసులను వేరే ఆస్పత్రిలకు రెఫర్ చేయడాన్ని తగ్గించాలని డీసీహెచ్ఎస్ బీఎస్కే నాయక్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని జిల్లా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు.

ఉభయదారులకు అభయం



ఆలయం ఎదుట ప్రమాణం చేస్తున్న ఉభయదారులు

- కాణిపాకంలో దళితుల సత్రానికి కాంప్లెక్స్ కేటాయిస్తాం
- పరిహారంగా రూ.30లక్షలు మంజూరు చేయిస్తాం
- ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హామీ



ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, దళిత ఉభయదారులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం (యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఉభయదారులుగా వ్యవహరిస్తున్న దళితుల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన 14 గ్రామాలకు చెందిన దళిత ఉభయదారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయకస్వామి ఆలయ సమీపంలోని మరగదాంబికా అమ్మవారి కల్యాణ మండపం బ్లాక్–3 కాంప్లెక్స్‌ను దళిత ఉభయదారుల సత్రానికి కేటాయిస్తామన్నారు.

అలాగే పరిహారం కింద రూ.30లక్షలు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ మేరకు నివేదికలు సిద్ధం చేసి దేవదాయ శాఖ కమిషనర్‌కు పంపుతున్నట్లు వివరించారు. దీనిపై దళిత సత్రం సేవా సమితి అధ్యక్షుడు కేశవులు, ఉభయదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఆలయంపై వేసిన కేసులన్నీ వాపసు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచనకు వారు అంగీకారం తెలిపారు.

దళిత ఉభయదారులు ప్రమాణం

ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో వినాయక స్వామి పుష్కరిణి వద్ద, ఆలయం ముందు సాయంత్రం 14 గ్రామాల దళిత ఉభయదారులు ప్రమాణం చేశారు. ఇకపై ఆలయం ముందు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా దళిత సత్రంపై అంతా ఒక్కతాటిపై ఉంటామన్నారు. ఆలయ అభివృద్ధిలో పాలు పంచుకుంటామని, వివాదాలకు పోమని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ బాబును ఘనంగా సత్కరించారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ఆధ్వర్యంలో ఉభయదారులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులతో ఆశీర్వచనం ఇప్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

అంబేడ్కర్ భవనానికి భూమి వితరణ

కాణిపాక సమీపంలోని ఐరాల గ్రామానికి వెళ్లే రహదారిలో అంబేడ్కర్ భవనానికి ఎకరా భూమిని విరాళంగా ఇస్తున్నట్లు విశ్రాంత ఈఓ కేశవులు ప్రకటించారు.

ప్రగతి పురోగతిపై సమీక్ష



ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ షణ్మోహన్


సాక్షి, చిత్తూరు : జిల్లా ప్రగతి పురోగతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షించారు. శుక్రవారం తాడేపల్లె నుంచి కలెక్టర్ షణ్మోహన్‌తో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనుల వివరాలను కలెక్టర్ వివరించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 66,091 పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయని, పూర్తి అయిన వాటిని గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రెండో విడత నాడు–నేడు పనులను వేగవంతం చేశామన్నారు. జగనన్న భూహక్కు పథకం కింద తొలి విడతలో 134 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు వెల్లడించారు. అందులో 40 గ్రామాలకు సంబంధించి సర్వే రాళ్లను నాటామని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమంలో వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జేసీ శ్రీనివాసులు, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, హౌసింగ్ పీడీ పద్మనాభం, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీఈఓ విజయేంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా అర్హులైన విద్యార్థులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సాంకేతిక శిక్షణ అందించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే శిక్షణ ఇప్పించాలని సూచించారు.

నిరంతరాయ విద్యుత్తే లక్ష్యం

- రైతులు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు
- జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు భేష్
- పోర్టల్ ద్వారా ఫిర్యాదుల నమోదు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, తిరుపతి: వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్‌ను సరఫరా చేయాలని రాష్ట్ర విద్యుత్, అటవీ భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన ఏపీఎస్పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వినియోగదారుల సమస్యలకు సంబంధించి సర్కిల్, డివిజన్ స్థాయిల్లో తరచూ సమీక్షలను నిర్వహించాలని చెప్పారు. విద్యుత్ సంస్థ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అడిగిన వెంటనే కనెక్షన్లు

రైతులు అడిగిన వెంటనే విద్యుత్ సర్వీసులను మంజూరు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇక జగనన్న కాలనీల విద్యుద్దీకరణ పనులు భేషుగ్గా ఉన్నాయని మంత్రి ప్రశంసించారు. సంస్థ పరిధిలో సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని చెప్పారు. డిస్కమ్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక వినియోగదారులకు కూడా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని, వినియోగదారులు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలని సూచించారు. విద్యుత్ బకాయిల వసూళ్లకు ప్రాధాన్యమివ్వాలన్నారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారుల సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు వీలుగా సబ్‌స్టేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.

సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగవంతం

ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు మాట్లాడుతూ సంస్థ పరిధిలో సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. త్వరితగతిన వ్యవసాయ విద్యుత్తు సర్వీసులను మంజూరు చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ ప్రమాదాల నివారణ, విద్యుత్తు పొదుపు అంశాలపై వినియోగదారుల అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఏపీ ట్రాన్స్‌కో డైరెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసే టవర్ల నిర్మాణానికి ఎదురయ్యే ఆటంకాలు పరిష్కారమవుతున్నట్టు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి పోర్టల్

గ్రామ, వార్డు సచివాలయాల్లో పోర్టల్ ద్వారా విద్యుత్ సమస్యలను నమోదు చేసే ప్రక్రియను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు వీఎన్ బాబు, ఎన్‌వీఎస్. సుబ్బరాజు, కె.శివప్రసాదరెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు డీఎస్.వరకుమార్, వై.లక్ష్మీనరసయ్య, డీవీ చలపతి. పి.ఆయూబ్‌ఖాన్. కె.గురవయ్య, కె.ఆర్.ఎస్. ధర్మజ్ఞాని, ఓఎస్ డీఎన్. శ్రీనివాసులు, ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ రమణ పాల్గొన్నారు.

సమృద్ధిగా నీటి సరఫరా



శంకర్‌బాబు, ఎస్ఈ

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో ఎక్కడా నీటి ఎద్దడి లేదని, సమృద్ధిగా సరఫరా సాగుతోందని గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ శంకర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద గత ఏడాది 22వేల కొళాయి కనెక్షన్లను ఉచితంగా ఇచ్చామన్నారు. ఈ ఏడాది 16 వేల కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో 408 గ్రామాల్లో నీటి సమస్య తలెత్తవచ్చని అంచనా వేశామని, ఆ మేరకు ట్యాంకర్లను సిద్ధం చేసినట్లు వివరించారు.

పేదల అభ్యున్నతికే 'నవరత్నాలు'

- ప్రజాసమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం
- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి



అంబోదరపల్లెలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు : పేదల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు అమలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం మండలంలోని అంబోదరపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకం అందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలు కావాల్సి వచ్చేదన్నారు. వారు ప్రతి పనికీ ధర నిర్ణయించి పేదలను దోచుకుతిన్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా, అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. అనంతరం అంబోదరపల్లెలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను ఆయన ప్రారంభించారు. ఆయా నిర్మాణాలకు స్థలాన్ని వితరణ చేసిన దాత ఆంజనేయరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనితారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, ఆర్‌బీకే అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడు అంబోదరపల్లె బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లావణ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు బాబునాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దారు ఇన్బనాథన్, డీఈ జ్ఞానేశ్వర్పాల్గొన్నారు.

యూటర్న్ బాబును ప్రజలు నమ్మరు

ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి, యూటర్న్ తీసుకునే చంద్రబాబును ప్రజలు నమ్మరని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. చంద్రబాబు అప్పట్లో సోనియాగాంధీని ఇటలీ దెయ్యం అని విమర్శించి, మళ్లీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీని గతంలో నరరూప రాక్షసుడని దూషించి, ఇప్పుడు దేవుడు అంటూ పొగుడుతున్నారని ఎద్దేవా చేశారు. పూటకో మాట చెప్పే చంద్రబాబును ఎప్పుడో ప్రజా విశ్వాసం కోల్పోయారని తెలిపారు. ఎల్లోమీడియా అండతో చంద్రబాబు, కొందరు పెత్తందార్లు కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 175 స్థానాలు కైవసం చేసుకోవడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

మామిడి తోటలో ఏనుగుల బీభత్సం

ఐరాల: మండలంలోని వినాయకపురంలో గురువారం రాత్రి వేణుగోపాల్ అనే రైతుకు చెందిన మామిడి తోటలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. చెట్లను విరిచేసి, సుమారు రెండున్నర టన్నులు బేనీషా కాయలను తొక్కి నాశనం చేశాయి. తోటలో అమర్చిన డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడిలో సుమారు రూ.50వేల పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. మండల అటవీశాఖ అధికారి జయశంకర్ ఘటనాస్థలానికి చేరుకుని ఏనుగులు నాశనం చేసిన మామిడి తోటను పరిశీలించారు.

రేపటి నుంచి క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

- రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహణ

నగరి : రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఆదివారం నుంచి క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. నగరిలోని కేవీకే క్రీడామైదానంలో నిర్వహించే పోటీల ద్వారా క్రీడాకారుల సెలక్షన్స్ ఉంటాయని శాప్ క్రికెట్ కోచ్ బాబు శుక్రవారం తెలిపారు. అండర్‌–16, అండర్‌–19 విభాగాలకు సంబంధించి, 2007, సెప్టెంబర్ 1 నుంచి 2009 సెప్టెంబర్ 1వ తేదీలోపు పుట్టిన వారు, 2004, సెప్టెంబర్ 1 నుంచి 2007 సెప్టెంబర్ 1వ తేదీ లోపు పుట్టిన వారు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని వివరించారు. ఆసక్తిగల వారు తెల్లటి దుస్తులు ధరించి, సొంత క్రీడా సామగ్రితోపాటు ఆధార్, ఫారమ్‌–5, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. ఎంపికైన వారికి వేసవి శిబిరంలో ఉచిత శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథం –8919633411, కృభాకరన్‌–8056116301, క్రికెట్ కోచ్ బాబు 8248110288ను సంప్రదించాలని కోరారు.

రెవెన్యూలో ఇద్దరికి స్థాన చలనం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా రెవెన్యూశాఖలో ఇద్దరికి స్థాన చలనం కల్పిస్తూ కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ బ్యూలాను చిత్తూరు కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో నియమించారు. అలాగే కార్వేటినగరం తహసీల్దార్ రఫీక్ అహమ్మద్‌ను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. ఆ స్థానంలో వెదురుకుప్పం తహసీల్దార్ పుల్లారెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు.

కోర్టు కేసులపై ఆరా

చిత్తూరు కార్పొరేషన్: సమాచార హక్కు చట్టం, లోకాయుక్త, కోర్టు, క్రమశిక్షణ కేసులపై జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి ఆరా తీశారు. ఆయన శుక్రవారం రాత్రి జెడ్పీ కార్యాలయంలో పరిపాలనాధికారులతో సమావేశమయ్యారు. కోర్టు కేసుల పరంగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని సూచించారు.

'వెట్టి' నుంచి విముక్తి

- బాధితులకు అండగా నిలిచిన రెవెన్యూ, పోలీస్ అధికారులు

వెదురుకుప్పం : ఇటుక బట్టీలో వెట్టి చాకిరీ చేస్తూ నానా అవస్థలు పడుతున్న ఓ కుటుంబానికి రెవెన్యూ, పోలీసు అధికారులు అండగా నిలిచారు. 6 నెలలుగా వారితో పనిచేయించుకుంటూ, కూలి ఇవ్వకుండా, సొంత ఊరికి పంపకుండా వేధిస్తున్న యజమాని చెర నుంచి విముక్తి కల్పించారు. ఎస్‌ఐ లోకేష్ కథనం మేరకు...మండలంలోని కొమరగుంట పంచాయతీ సద్దికూళ్లపల్లె సమీపంలో ఓ వ్యక్తి ఇటుకల తయారీ కేంద్రం నడుపుతున్నాడు. అందులో పనిచేసేందుకు ఒడిశాకు చెందిన నబీన్‌తాండ, అతడి కుటుంబంతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా వారితో బలవంతంగా పనిచేయించుకుంటున్నాడు. తమను వదిలేస్తే ఊరికి వెళ్లిపోతామని బాధితులు వేడుకున్నా, ఏమాత్రం కనికరించలేదు. ఈ నేపథ్యంలో నబీన్ తాండి, కుటుంబసభ్యుల దుస్థితిని వారి స్నేహితుడు వీడియో తీసి గురువారం ట్విట్టర్‌లో పెట్టాడు. ఈ ట్వీట్‌ను చూసిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి వెంటనే స్పందించి బాధితులను ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరి డీఎస్పీ రవికుమార్, కార్వేటినగరం సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ లోకేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయంత్‌కుమార్ హుటాహుటిన ఇటుకల తయారీ కేంద్రానికి వెళ్లారు. బాధితులను పరామర్శించారు. ఇటుక బట్టీ యజమానితో మాట్లాడి వారికి రావాల్సిన కూలి సొమ్మును ఇప్పించారు. అనంతరం బాధితులను చిత్తూరుకు తీసుకువెళ్లి ఒడిశాకు వెళ్లే రైలు ఎక్కించారు. జిల్లా అధికారుల సాయానికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధిత కుటుంబంతో ఎస్‌ఐ లోకేష్, ఆర్‌ఐ జయంత్‌కుమార్

హైవేలకు భూసేకరణ వేగవంతం



జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూసేకరణను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చిత్తూరు–తచ్చూరు హైవే పనుల పురోగతిపై సమీక్షించా రు. జేసీ మాట్లాడుతూ భూసేకరణ పరిహారం కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. చిత్తూరు– తచ్చూరు రహదారికి సంబంధించి పిచ్చాటూరు, నగరి, శ్రీ రంగ రాజపురం , గంగాధరనెల్లూరు, చిత్తూరు మండలాల్లో పరిహారం కేసులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని పరిశీలించి, అవరోధాలు లేకుంటే మూడు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.. పరిహారం చెల్లింపులో అలసత్వం వహించకూడదని సూచించారు.సమీక్షలో ఆర్డీఓ రేణుక, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నూతన భవనంలో పూజ



పూజా కార్యక్రమంలో ఆర్డీఓ రేణుక

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలోని నూతన భవనంలో శుక్రవారం పూజా కార్యక్రమం నిర్వహించారు. త్వరితగతిన అన్ని పనులను పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆర్డీఓ రేణుక ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రామాంజులు నాయక్, డీటీ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి



మాట్లాడుతున్న బాలుడి తల్లి షమీమ్

చిత్తూరు రూరల్: పుట్టుకతో కాలేయం, గుండె సమస్యతో బాధపడుతున్న తమ బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని చిత్తూరు నగరం న్యూ బాలాజీ కాలనీకి చెందిన ఓ తల్లి వేడుకుంది. శుక్రవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో తల్లి షమీమ్ మాట్లాడుతూ తమ కుమారుడు అబ్దుల్ రెహమాన్ బాషాను చిన్నప్పటి నుంచి నిత్యం ఆస్పత్రికి తీసుకెళుతున్నామని, ఇప్పటి వరకు రూ.లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. ప్రస్తుతం బాలుడు ఆహారం తీసుకున్న వెంటనే రక్తపు వాంతులు చేసుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. చికిత్స కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అడ్మిట్ చేసి వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుందన్నారని వెల్లడించారు. ఇప్పటికే అప్పులపాలయ్యామని, మళ్లీ రూ.లక్షలు వెచ్చించే స్తోమత లేదని వాపోయారు. తమ బిడ్డ వైద్యానికి దాతలు సాయం చేయాలని విన్నవించారు. చేయూతనందించాలనుకునే దాతలు 9014204783, 9966102098 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

సదుం: అదనపు కట్నం కోసం వేధింపులపై భార్య ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మారుతి శుక్రవారం తెలిపారు. గాండ్లపల్లెకు చెందిన రూపకు నాలుగేళ్ల క్రితం బలిజపల్లెకు చెందిన గంగరాజుతో వివాహమైంది. అప్పటి నుంచి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

దాడిపై కేసు నమోదు

సదుం: మండలంలోని రాచవారిపల్లెకు చెందిన బ్రహ్మానందరెడ్డి, ఎర్రంరెడ్డి అనే రైతులు శుక్రవారం తమ పొలం వద్ద నీటి విషయమై వాగ్వాదానికి దిగారు. దీంతో కోపం పట్టలేని బ్రహ్మానందరెడ్డి కర్రతో దాడి చేయడంతో ఎర్రంరెడ్డి గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుళ్లినస్థితిలో మృతదేహం లభ్యం

వి.కోట: స్థానిక ఎగువ చెక్‌పోస్టు వద్ద కరీం కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఇంట్లో శుక్రవారం ఓ మృతదేహం వెలుగుచూసింది. ఇంట్లో ఉంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు తలుపులు పగులగొట్టి చూశారు. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అతను మరణించి మూడు, నాలుగు రోజులై ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.